# WHAT CONCORD BETWEEN LIGHT AND DARKNESS

ఆంగ్లమూలము : Not Known    అనువాదము : పురుషోత్తము చౌధరి

## వెలుగుకున్నుచీకటికిన్ని యేమిసాంగత్యము (1862)

నిజమైన దేవుని భక్తియందు విముఖులై విగ్రహ సేవాసక్తిగల పండితులు క్రీస్తు భక్తులను చూచి వీరు ప్రతిమార్చకుల యెడల యింత భిన్న హృదయులై యెందుకు వుండవలయును–దానికి కారణమేమి అని అడిగినట్టయితే – అందుకు మేము యిచ్చే దృఢమైన ప్రత్యుత్తరము యిదిగదా – వుదయాద్రికి అస్త్రాద్రి యెంత దూరమో విగ్రహారాధకుల తో మాకు ఇహపర సత్య వ్యాపారముల యెడల అంతదూరముగా వుండును గాని హృదయ పూర్వకమైన సాంగత్యము సేయుట యెన్నటికిన్ని యే చొప్పుననున్ను సమకూడనేరదు – దానికి కారణములు యివి యని యీ దిగువను చెప్పుతున్నాము.

నాశము లేని అనంత పరిశుద్ధత్వము గల సర్వవ్యాపకుడని యే దేవుని గురించి మేము యెరిగి యున్నామో – అట్టి పరాత్పరుని పైని మీరు అపవాదములు మోపుతున్నారు – అది యేలాగునంటే – వొకప్పుడు ఆయన పుట్టెనని న్ని వొకప్పుడు చచ్చెననిన్ని మరియు నొక్కొక్క సమయముల యందు ఆయన దొంగ తనమున్ను, వ్యభిచారమున్ను, యుద్ధమున్ను చేసినాడనిన్ని యింకా కామ క్రోధాది గుణములకు లోనయినాడనిన్ని యిటువంటి అపవాదములు చెప్పి మీరు దేవుని నిందిస్తున్నారు. కాబట్టి మీ సాంగత్యము చేయుటకు మా అంతఃకరణములో యేలాగు ప్రీతి పుట్టును.

మీకు వుదాహరణముగా పూర్వమందు బయిలు పరచబడిన యొక ఋషి వాక్యము వున్నది – యేలాగంటే.

శ్లోకం॥ జనాపవాదంత ద్ద్రోహం । చౌర్య దారాభిమర్షణం ।
భీభత్సం మరణం క్షోభం । కుక్రి యావివిధాః కథాః ।
పాషండినో బిధ్యాన్యంతి । విశుద్ధేపరమాత్మని ॥

**తాత్పర్యము॥** కలికాలములో పాషండ జనులందరున్ను విశుద్ధ స్వరూపియైన పరమాత్మునియందు జన్మము ద్రోహము- అబద్ధము - కామము-క్రోధము-చోరత్వము-పరస్త్రీ గమనము-మరణము ।క్షోభము। యీ మొదలయిన దుష్క్రియలన్ని వున్నట్టుగా ఆరోపించి చెప్పుదురు.

యిది గాక బహు విధములయిన మీ దుఃఖావస్థలను మేము చూచినప్పుడు అవస్యము మాలో దయపుట్టక మానదు - అవి యేవనగా ॥ ఆహార ద్రవ్యములు మీకు వున్నప్పటికిన్ని భోజనము మానినట్టయితే దేవుడు సంతోషించునని చెప్పి నిరాహారులై యెండుతున్నారు - దానము చేయుటకు పాత్రుడైన దరిద్రుడు యెవడో వానికి దానము యివ్వక మిక్కిలీ అభిమానియును ధనికుడునయిన వొక మోసగానికి దానము యిస్తున్నారు.

సుగంధ పుష్పాదులు ఆఘ్రాణించుటకు శక్తుడయిన వానికి యియ్యక తామ్రకుండిక లోనైనా లేక నదిలోనైనా లేక నిర్జీవ ప్రతిమల మీదనైనా వేసి వాటిని నష్టపరుస్తున్నారు.

చలికాలములో నీళ్లవల్లనున్ను గ్రీష్మకాలములో అగ్నివల్లనున్ను సంభవించే దుఃఖములను మీ స్వేచ్ఛచేతనే పొందుతున్నారు యే విగ్రహము మీరు దేవుడని భావించుదురో అది చలిచేత దుఃఖించునని శీతాకాలములో దానికి చలికొరకు వస్త్రములు కప్పి వేసవికాలములో అది వెట్టచేత శ్రమపడునని దానికి పంకావి సురుతున్నారు.

మరిన్ని ఆ ప్రతిమకు దోమలు కరుచుననే భయముచేత రాత్రులు దాని తెరలోపల పెట్టుతున్నారు. దేవుడు యిక్కడలేడు అడుగో ఫలానా స్థలమందు వున్నాడని యా భ్రమచేత నానా దేశములకు పోయి దిమ్మదిరు/గుటవల్ల మిక్కిలి క్లేశము పొందుతున్నారు. అటువంటి యాత్రాస్థలములలో బురద నీళ్లు గాని యెటువంటి మైలనీళ్లుగాని అవి పానముచేసి వాటివల్లను రోగపీడుతుల వుతున్నారు. యిదిగాక మీలో వొకానొకడు అనేక స్త్రీలను వివాహమై వారిని దుఃఖమందున్ను అపవిత్రతయందున్ను పడేటట్టు చేసి తరువాత మనస్తాపము పొందు తున్నారు. యిరువై రూపాయీలు ఖరీదుగల వొక గుర్రమునకైనా సరిగాని వొక రాతినయినా లేక వొకమంటి ముద్దనయినా కొని దానిని మీ యొక్క

దైవమని చెప్పుతున్నారు. మరిన్ని అహంకార పరిపూర్ణుడై యొక డంబపు వానిని గురువుగా మీరు యెంచుకొంటున్నారు - అదిగాక సూర్యసిద్ధాంతాది జ్యోతిశ్శాస్త్రములలో భూమి గోళాకారమనిన్ని శూన్యముగా తిరుగుతూ వున్నదనిన్ని భూఛాయ వల్ల చంద్రగ్రహణమవునిన్ని చెప్పియున్నది. మరిన్ని సూర్యరశ్మివల్ల జలాకర్షనమై దాని నుంచి వర్షములు కలుగునని వర్ణించబడెను. అటువంటి వుపదేశములు మీరు మీ కుమాళ్లకు నేర్పించక వ్యర్థకల్పనలయిన పురాణేతి హాసములయందు వ్రాయబడిన ప్రకారము నేర్పించుచున్నారు - అనగా భూమి త్రికోణాకారముగా వుండి అది వొక పాముతల మీద వుండుననిన్ని సూర్యచంద్రులకు శత్రువై రాహువు వారిని మ్రింగినందువల్ల గ్రహణము కలుగుననిన్ని మేఘములు వానలు కురిపించుననిన్ని మేఘ గర్జనలు దేవతల రథ చక్ర శబ్దములనిన్ని యిటువంటి వ్యర్థ కల్పనలు నేర్పుతున్నారు.

మరిన్ని వొకడు తుమ్మినప్పుడున్ను బల్లి అరిచినప్పుడున్ను మీకు శుభాశుభములు వచ్చునని నిశ్చయించుకొంటున్నారు - యిటువంటి అజ్ఞాన వ్యాపారములు వేల కొలది మీలో వ్యాపించి యున్నవి - నిజముగా మనుష్యాకారము గల వారిలో యీలాటి అవివేక తాత్పర్యములు వుండడము చూచినప్పుడు మాకు మనస్తాపము కలగకుండునా? మీతో ఐక్యతగల మనస్సు మాకు లేకపోవడము యెందుకంటే మీరు వేటిని పవిత్రకార్యములని తలంచి ఆరాధిస్తున్నారో మేము వాటిని కేవలము అపవిత్రములని యెరిగియున్నాము. మరిన్ని వాటి వివరణము యీ దిగువను చెప్పుదుము - మీరు మృత్తికాపాషాణ పశుపక్షి మృగాదులను దైవములని భావిస్తున్నారు - మేము అలాగు భావించము మీరు కర్రపూసలు మొదలైన వాటిని కంఠమాలికలుగా ధరించుకొనుట యున్ను నానా విధములైన బొట్లు నొసటపెట్టుకొనుటయున్ను పుణ్యాకారణములని తలంచుచున్నారు - మేము ఆలాగు తలంచము - మీరు విశేషస్థలముల యందలి నీళ్లనున్ను, ధూళినిన్ని, బురదనున్ను పానముసేయుటవల్లనున్ను దేహమునందు ధరించుకొనుట వల్లనున్ను పుణ్యము వచ్చునని చెప్పుతున్నారు - మేము అది వొప్పుకొనము. మీరు స్థలవిశేషము యెంచి అక్కడి అన్నము పుణ్యజనక మని తింటున్నారు - మేము అది వొప్పుకొనము.

మరిన్ని మీలోకొన్ని మతముల వారు మత్తువస్తువులు తినుటయున్ను తాగుటయున్ను జీవహింసగల రక్తోత్సవమున్ను పరమార్ధసాధనములని తలంచి చేస్తున్నారు - ఆలాగు మేము తలంచము - మీలో మరి కొందరు మతస్థులు శరీర బహిర్గతమైన అపవిత్రవస్తువులు భక్షించుటవల్ల యెంతో పుణ్యమనిచెప్పుదురు - మేము వాటిని పుణ్యమైనవని చెప్పము. మరిన్ని స్త్రీలను పెనిమిట్లతో అనుగమనమనే మిషచేత అగ్ని ప్రవేశము చేయించి అది పుణ్యమని మీరు చెప్పుతున్నారు. మేము దాని ఘోరమయిన హత్య యనుదుము అనేకజనులను పోగుచేసి దానము యిచ్చి పొగిడించు కొనుట పుణ్యమనిమీరు యెంచుకొంటున్నారు - అలాగు మేము యెంచేది లేదు.

దేవ సన్నిధియందున తాళమృదంగ శంఖ ఘంటాది వాద్యములున్ను నృత్యగానాదులున్ను జరుపుట మీరు పుణ్యమని చెప్పుదురు - మేము ఆలాగు చెప్పము - వుపాసనాది విశేషములయందు వ్యభిచారాది క్రియలను మీరు పుణ్యమని చెప్పుదురు - అది కేవలము పాపమని మేము చెప్పుదుము.

యిందు నిమిత్తము ఓ సహోదరులయిన మనుష్యులారా కేవలము జడములయిన మూగి బొమ్మలతో ఆట్లాడడము మీరు యీ పాటికి విడిచిపెట్టి సర్వవ్యాపకుడైన దేవుని మీ మనోవాక్కాయ కర్మములతో అవి సాక్షులుగా విశ్వసిచండి మరిన్ని ఆయన ఆజ్ఞాపించిన ప్రకారము నడుచు కొనుటకు యత్నపడండి.

దేవుని గ్రంథములో వ్రాయబడి యుండేది చూడండి - యెవడు యీ జగత్తునున్ను అందులో నుండే సమస్తమునున్ను నిర్మించెనో ఆ దేవుడు తానే అకాశమునకున్ను భూమికిన్ని ప్రభువైయున్నందున హస్తకృతము లయిన ఆలయములలో నివసించడు. మరిన్ని ఆయన అందరికిన్ని జీవమున్ను వూపిరిన్ని సమస్తమున్ను దయచేసే వాడైనందున తనకు యేదయినా కావలసినట్టు మనుష్యుల చేతి ద్రవ్యములవల్ల సేవించబడడు - అనగా దూర్వాక్షతములున్ను, పత్ర, పుష్ప, ఫల, తోయములన్ను వెండి, బంగారములున్ను యీ మొదలయిన వస్తువులను ఆయన యొద్ద సమర్పించినట్టయితే అందుకు ఆయన సంతుష్టి పొందడు.

దేవుడు పరమాత్ముడు గనుక ఆయనను ఆరాధించేవాడు ఆత్మతోనున్ను సత్యముతోనున్ను ఆరాధించవలెను.

మరిన్ని స్వాభావికముగా మనుష్యుడు పాపియయి యున్నాడు - వాని క్రియలన్నీ పాపముతో నిండియున్నవి - యిందుచేత వాని క్రియలవల్ల వానికి రక్షణ దొరకదు - కాబట్టి తన స్వపాపము కనుగొని మనస్తాపముగలవాడై క్రీస్తునామము చేత క్షమాపణ కొరకు ఆయనను ప్రార్థించినట్టయితే రక్షణ పొందును.

దేవుడు అందరికిన్ని తండ్రియై యున్నాడు - మనుష్యులందరూ ఆయనవల్లను సృష్టించబడి యున్నారు - అయినప్పటికీ మిక్కిలి దుఃఖించుటకు హేతువు యిదిగదా యీ నరులు అనంత పరమదయా సముద్రుడైన ఆ తండ్రిని విడిచి నానా విధమిథ్యాకల్పితులయిన తండ్రులను అనాగా చిల్లర వేల్పులను నిర్మాణము చేసుకొని యున్నారు. యిందుకయి దేవుడు తానే చెప్పినదేమంటే.

ఓ ఆకాశములారా వినండి - ఓ భూమీ నీ చెవిని యొగ్గుము - నేను పిల్లలను పోషించి పెంచితిని. అయితే నా మీదికి వారు తిరగబడిరి - యెద్దుతన యజమానునిన్ని గార్ధభము తన యేలిన వాని యొక్క తొట్టినిన్ని యెరుగును. అయితే నా జనులు నన్ను యెరుగక వున్నారు. గ్రహించుటకు బుద్ధి నా జనులకు లేక పోయెనని పలికెను - యీలాగు న్నప్పటికిన్ని ద్రోహులయిన యీ నరుల యెడల దేవుడు యెల్లప్పుడున్ను దయచూపి వారికి అవసరమైన సకల పదార్థములున్ను యిస్తున్నాడు. మరిన్ని దేవుడు చెప్పుతున్నదేమంటే.

నా జీవముతోడు దుర్మార్గుని మరణమువల్ల నాకు సంతోషము లేదు. దుర్మార్గుడు తన దుర్మార్గతను విడిచి బ్రతుకుట వల్ల నాకు సంతోషము కలుగును - యిందు కొరకు మీ దుర్మార్గతను విడిచి తిరుగండి తిరుగండి - యెందుకు మరణమౌదురు.

మరిన్ని దేవుడు చెప్పుతున్నాడు. యేలాగునంటే ఇదుగో రండి మనము వాదింతము మీ పాపములు రక్తవర్ణముగా వున్నప్పటికిన్ని అవి మంచువలెనే తెల్లని వౌను - సిందూరము వలె వున్నప్పటికిన్ని అవి

దూదివలె శుక్లవర్ణము కలవి అవును - మరిన్ని ప్రభువయిన యేసుక్రీస్తు తన నోటితో పలికిన దేమంటే - దేవుడు లోకుల యందు యింతంత ప్రేమ వుంచినాడా యీయన యందు నమ్మిక వుంచే వారెవరో వారు నశించక నిత్యమైన జీవము పొందుతారని తన అద్వితీయుడైన కుమారుని యిచ్చెను - ఇది నిజమయిన వాక్యము - యిటువంటి దయగల వాగ్దత్తములు కలిగియున్నవి గనుక విగ్రహారాధనాది పాపముల నిమిత్తము యెవడు పశ్చాత్తాపమున బొంది ప్రభువయిన యేసుక్రీస్తు నామము చేత తండ్రియైన దేవునియొద్ద రక్షణ వేడుకొనునో వానియొక్క పాపము పరిహరించబడి వాడు మనశ్శాంతిని బొందును. మరిన్ని అతడు క్రమ క్రమముగా పాపముయొక్క బలమునుంచి విడుదల బొంది నూతన హృదయముతో పరిశుద్ధ ప్రవర్తన గల వాడవును. మరిన్ని మరణ కాలమందు అటువంటి వాడు దేవుని సన్నిధికి వెళ్లి నిత్యజీవానందము అనుభవించును.

కాబట్టి ఓ సమస్త జనులారా, పరిశుద్ధ వేదమయిన శుభసమాచార గ్రంథములో వ్రాయబడియున్న యీ వాక్యము వినండి.

మీరు అవిశ్వాసులతో యిజ్జోడుగా కాడి కింద వుండకండి యెందుకంటే నీతికి అనీతితో యేమి సంబంధము వెలుగుకు చీకటితో యేమి సహవాసము క్రీస్తుకు బెలియాలుతో యేమి సంధర్భము అవిశ్వాసితో విశ్వాసికి పాలు యెక్కడిది. మరిన్ని దేవుని ఆలయమునకు విగ్రహములతో యేమి పొందికె - యెందుకంటే - నేను వారిలో నివసిస్తూ సంచరింతును. నేను వారి దేవుడనయి యుందును వారు నా జనులై యుందురని దేవుడు చెప్పిన ప్రకారము మీరు జీవము గల దేవుని ఆలయమయి యున్నారు - కాబట్టి ప్రభువు చెప్పేదేమంటే - మీరు వారి మధ్యనుంచి బయిలు దేరి ప్రత్యేకముగా వుండండి. అపవిత్రమైన దాని ముట్టకండి అప్పుడు నేను మిమ్మును చేర్చుకొందును. మీకు తండ్రినయి యుందును మీరు నాకు కుమారులున్ను, కుమార్తెలున్నై యుందురని సర్వశక్తిగల ప్రభువు చెప్పుతున్నాడు.